క్లుప్తంగా

డాక్టర్ విజయ్‌కుమార్‌ను గెలిపించండి

శంషాబాద్: హైదరాబాద్, రంగారెడ్డి, మహబూబ్‌నగర్ టీచర్స్ ఎమ్మెల్సీ స్థానానికి రాష్ట్ర భాషోపాధ్యాయ సంఘం (ఎస్‌ఎల్‌టీఏ–టీఎస్) బీసీటీఏ బహుజన సంఘాలు బలపరినన ఉమ్మడి అభ్యర్థి విద్యావేత్త డాక్టర్ విజయ్‌కుమార్ మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ఎస్‌ఎల్‌టీఏ జిల్లా అధ్యక్షుడు బషీర్, జిల్లా ప్రధాన కార్యదర్శి బండారి అనిల్‌కుమార్ అన్నారు. విద్యారంగంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి విజయ్‌కుమార్ శక్తివంచన లేకుండా కృషి చేస్తారన్నారు. మూడు జిల్లాల్లో విద్యాశాఖాధికారిగా పనిచేసిన అనుభవం కలిగిన విజయ్‌కుమార్ విద్యావేత్తగా గుర్తింపు పొందారన్నారు. ఉపాధ్యాయులు తమ ఓటును విజయ్‌కుమార్ వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు.

మున్సిపల్ కార్మికులకు వైద్య పరీక్షలు


వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

మణికొండ: ప్రపంచ మహిళా దినోత్సవం సందర్భంగా నార్సింగి మున్సిపాలిటీ పరిధిలో పని చేస్తున్న మహిళా కార్మికులు, సిబ్బందికి శనివారం వైద్య పరీక్షలను నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ డి. రేఖయాదగిరి గండిపేట మండల వైద్యాధికారి డాక్టర్ పద్మ, మహిళా కౌన్సిలర్ల కలిసి వైద్య పరీక్షలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు ఆరోగ్యాన్ని పరిరక్షించుకునేందుకు తరచూ వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు జి.అరుణజ్యోతి, ఉషారాణి, వైద్య సిబ్బంది, మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు.

గుంతలు తవ్వి వదిలేశారు..

- అసంపూర్తిగా అభివృద్ధి పనులు
- గుంతల్లో పడి వాహనాదారులకు గాయాలు
- పట్టించుకోని అధికారులు

బండ్లగూడ: గతుకులమయమైన రోడ్లతోనే ఇబ్బందులు పడుతున్నామంటే అభివృద్ధి పనుల కోసం తవ్విన గోతులతో మరిన్ని అవస్థలు ఎదుర్కొంటున్నామని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ప్రజలు వాపోతున్నారు. అంతర్గత డ్రైనేజీ పైపులైన్‌ల నిర్మాణం కోసం తవ్విన గోతుల వద్ద ఎలాంటి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయక పోవడం, నెలలు తరబడి వాటిని పూడ్చకపోవడంతో వాహనదారులు తరచూ వీటిలో పడి ప్రమాదాలకు గురవుతున్నారు. కార్పొరేషన్ పరిధిలోని గాయత్రీనగర్ కాలనీలో జరుగుతున్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనుల కోసం తవ్విన గుంతలో శనివారం ఓ కారు ఇరుక్కుపోయింది. స్థానికులు వెంటనే స్పందించి కారులో ప్రయాణిస్తున్న వారిని బయటికి తీసి ప్రాణాపాయం నుంచి తప్పించారు.


గాయత్రీనగర్‌లో డ్రైనేజీ పనుల కోసం తవ్విన గుంతలో పడిన కారు

పొంచి ఉన్న ప్రమాదం...

అభివృద్ధి పనుల పేరుతో తవ్విన గోతులను పూడ్చకపోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. వీటిలో పడి ద్విచక్ర వాహనదారులు, పాదచారులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాత్రి వేళల్లో సమస్య మరింత తీవ్రంగా ఉందని ఎక్కడ గొయ్యి ఉందో ఎక్కడ రోడ్డు ఉందో తెలియని పరిస్థితి నెలకొందన్నారు.

నత్తనడకన పనులు...

అధికారులు, కాంట్రాక్టర్ల అలసత్వం కారణంగా అభివృద్ధి పనులు ముందుకు సాగడం లేదు. పనుల పేరుతో ప్రధాన రహదారులపైనే నెలలు తరబడి వాహనాల రాకపోకలను నిషేధిస్తుండడంతో చిన్న చిన్న గల్లీలో ప్రయాణించేందుకు వాహనదారులు ఇక్కట్లు పడుతున్నారు. అంతర్గత డ్రైనేజీ, మంచి నీటి పైపులైన్, రోడ్ల నిర్మాణం పేరుతో రహదారులను నెలల తరబడి మూసివేస్తున్నారు. దీంతో ఎటు వెళ్లాలో తెలియక వాహనదారులు అయోమయానికి గురవుతున్నారు. ఏ గల్లీలో చూసి తవ్వకాలే కనిపిస్తున్నాయని ఆయా ప్రాంతాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మహనీయులను ఆదర్శంగా తీసుకోవాలి


రాజేంద్రనగర్ సర్కిల్ జయంతి ఉత్సవ కమిటీ సభ్యులను అభినందిస్తున్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్

రాజేంద్రనగర్: మహనీయులను యువత ఆదర్శంగా తీసుకోవాలని రాజేంద్రనగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్ అన్నారు. రాజేంద్రనగర్ సర్కిల్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ జయంతి ఉత్సవ కమిటీ సభ్యులు శనివారం ఎమ్మెల్యేను కలిశారు. నూతనంగా ఎన్నికైన జయంతి ఉత్సవ కమిటీ అధ్యక్షులు పలుగుచెరువు మహేష్, ప్రధాన కార్యదర్శి బట్టు శ్రీనివాస్‌ను ఎమ్మెల్యే ఘనంగా సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రంగారెడ్డి జిల్లాలో రాజేంద్రనగర్ సర్కిల్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ జయంతి ఉత్సవ కమిటీకి ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. కమిటీ సభ్యులంతా కలిసికట్టుగా ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలన్నారు. తన వంతు సహాయ సహకారాలు అందిస్తానన్నారు. కార్యక్రమంలో వ్యవస్థాపక అధ్యక్షులు, ముఖ్య సలహాదారులు పోయిల జీవన్‌దాస్, వనం నర్సింహ్మా, మంత్రి చంద్రశేఖర్, అనుముల జాన్‌పాల్, కోశాధికారి మంగళారం శ్రీనివాస్, ఉపకోశాధికారి ఎడ్లగాడి సూర్యం, ఉపాధ్యక్షులు రగడంపల్లి శ్రావణ్‌కుమార్, దాసరి రమేష్, వినాయక ప్రీతమ్‌రాజ్, వీర్లపల్లి మహేష్, నవీన్, జోగి శ్రీనివాస్, లేవి రాజ్, సంయుక్త కార్యదర్శి అదిరాల రవికుమార్, బీఆర్ఎస్ పార్టీ రాజేంద్రనగర్ డివిజన్ అధ్యక్షులు పోరెడ్డి ధర్మారెడ్డి, తెప్ప అరుణ, అక్కిరాజు సుబ్బారావు, కమల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మద్యం మత్తులో కిందపడి వ్యక్తి మృతి

రాజేంద్రనగర్: మద్యం మత్తులో కిందపడి ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. రవి(45) అనే వ్యక్తి శాస్త్రీపురంలోని మహ్మద్ ఇంతియాజ్ వద్ద సెంట్రింగ్ కార్మికుడిగా పని చేస్తున్నాడు. మద్యానికి బానిసైన అతను శనివారం ఉదయం మద్యం మత్తులో శాస్త్రీపురం మీదుగా తాను పని చేస్తున్న ప్రాంతానికి వెళ్తున్నాడు. ప్రమాదవశాత్తు కిందపడి తలకు తీవ్ర గాయం కావడంతో స్థానికులు 108 సిబ్బందికి సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న వారు అతడిని పరిశీలించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. పోలీసులు మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించారు.

ప్రశ్నించే గళానికి ప్రాధాన్యం ఇవ్వండి

రాజేంద్రనగర్: ఉమ్మడి మహబూబ్‌నగర్, రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల ఉపాధ్యాయ నియోజకవర్గ శాసన మండలి ఎన్నికల్లో ప్రశ్నించే గళానికి మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని అత్తాపూర్ డివిజన్ బీజేపీ కార్పొరేటర్ మోండ్ర సంగీత గౌరీశంకర్ అన్నారు. శనివారం ఎమ్మెల్సీ ఎన్నికల ప్రముఖ్ రాచూరీ రాజశేఖర్‌తో కలిసి ఉపాధ్యాయుల ఇళ్లకు వెళ్లి బీజేపీ బలపరిచిన ఏవీఎన్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల కోసం అలుపెరగని పోరాటం చేస్తున్న వారికి ఓటు వేయాలన్నారు. ఉమ్మడి సర్వీస్ రూల్స్‌ను అమలు చేయకుండా రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని ఆరోపించారు. టీచర్ పోస్టులను భర్తీ చేయకపోవడంతో విద్యావ్యవస్థ కుంటుపడుతుందన్నారు.


ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న కార్పొరేటర్ మోండ్ర సంగీత గౌరీశంకర్ తదితరులు

టీచర్లకు పని ఒత్తిడి పెరిగిపోయిందన్నారు. బీజేపీ మొదటి నుంచి ఉపాధ్యాయుల సమస్యలపై పోరాడుతుందని, బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర బీజేపీ నాయకులు కాడెం సుధాకర్, గౌరీశంకర్ తదితరులు పాల్గొన్నారు.

గృహిణి అదృశ్యం

రాజేంద్రనగర్: ఇంటి నుంచి బయటికి వెళ్లిన మహిళ అదృశ్యమైన సంఘటన మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం చోటు చేసుకుంది. ప్రగతి నగర్‌కాలనీకి చెందిన శ్యామల(35) మోహన్ దంపతులు గత వారం గొడవపడ్డారు. దీంతో శ్యామల తన కుమార్తెను తీసుకుని శివరాంపల్లిలోని పుట్టింటికి వచ్చింది. కుటుంబ పెద్దలు వారికి నచ్చజెపికప గురువారం శ్యామలను ఆమె భర్త మోహన్‌తో కలిసి ఇంటికి పంపించారు. శనివారం ఉదయం ఇంటి నుంచి బయటికి వెళ్లిన శ్యామల తిరిగి రాలేదు. ఆమె కోసం గాలించిన ప్రయోజనం లేకపోవడంతో ఆమె భర్త మోహన్ మైలార్‌దేవ్‌పల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

లాడ్జీల్లో పోలీసుల తనిఖీలు

శంషాబాద్: సైబరాబాద్ పరిధిలోని ఓయో హోటళ్లు, లాడ్జీల్లో శుక్రవారం, శనివారం సైబరాబాద్ పోలీసులు విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. 39 లాడ్జీలను తనిఖీలు చేయగా శంషాబాద్ పట్టణంలోని రెండు లాడ్జీలు నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్నట్లు గుర్తించారు. స్థానిక మెరిడియ హోటల్, ఫ్యాబ్ లాడ్జీలో మద్యం తాగేందుకు అనుమతులు ఇవ్వడంతో పాటు నిబంధనలు పాటించకపోవడంతో కేసులు నమోదు చేశారు. మెరిడియన్ హోటల్ మేనేజర్ అబ్దుల్ ఖదీర్, ఫ్యాబ్ లాడ్జీ మేనేజర్ శేఖర్‌లను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఫ్యాబ్ లాడ్జీ యజమాని ఆరోగ్యరెడ్డి పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలి


కార్యక్రమంలో పాల్గొన్న మేయర్ మహేందర్‌గౌడ్ తదితరులు

బండ్లగూడ: మహిళల గొప్పతనాన్ని అందరూ తెలుసుకుని వారిని అన్ని రంగాల్లో ప్రోత్సహించాలని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ మహేందర్‌గౌడ్ అన్నారు. శనివారం పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ 'మెప్మా' ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల్లో ఆయన కార్పొరేటర్ సాగర్‌గౌడ్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేక్‌కట్ చేసి మహిళలకు మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మహిళల గొప్పతనాన్ని అందరూ తెలుసుకోవాలన్నారు. మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలన్నారు. కార్యక్రమంలో మెప్మా అధికారి శ్రీలత, మహిళా సంఘాల అధ్యక్షులు మధుమతి తదితరులు పాల్గొన్నారు.

దేవాలయాల అభివృద్ధికి కృషి


పూజల్లో పాల్గొన్న కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి

రాజేంద్రనగర్: దేవాలయాల అభివృద్ధికి తనవంతు సహాయ సహకారాలు అందిస్తానని మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శనివారం ఎయిర్‌పోర్టు కాలనీలోని శ్రీ ఆంజనేయస్వామి దేవాలయంలో ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనను దేవాలయ కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. అనంతరం మాట్లాడుతూ దైవ దర్శనంతో మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. ప్రతి ఒక్కరు దైవచింతన అలవర్చుకోవాలన్నారు. దేవాలయాల అభివృద్ధికి ఎల్లప్పుడు ముందుంటానన్నారు. కార్యక్రమంలో కళ్యాణరెడ్డి, శ్రీరాములు యాదవ్, శేఖర్‌యాదవ్, రమేష్, సుధాకర్‌రెడ్డి, రావుల భాస్కర్, తలారి చిన్న తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆదిత్య టాలెంట్ స్కూల్ వార్షికోత్సవం

రాజేంద్రనగర్: పేద, కార్మిక కుటుంబాల చిన్నారులను విద్యావంతులుగా తీర్చిదిద్దడంలో ఆదిత్య టాలెంట్ స్కూల్ యాజమాన్యం చేస్తున్న కృషి, పట్టుదల అభినందనీయమని రాజేంద్రనగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్ అన్నారు. వెంకటేశ్వర కాలనీలోని ఆదిత్య టాలెంట్ స్కూల్ 12వ వార్షికోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యాభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తుందన్నారు. విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు. కార్యక్రమంలో రాజేంద్రనగర్ మండల మాజీ విద్యాధికారి సురభి భూపతిరావు, మాజీ కార్పొరేటర్ టి.ప్రేమ్‌దాస్‌గౌడ్, ప్రభాకర్ చారి, నిరంజన్, జయప్రకాష్, సూర్యనారాయణ, అనిత, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్

బండి సంజయ్ వ్యాఖ్యలు అనైతికం

రాజేంద్రనగర్: ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితపై అనుచిత వ్యాఖ్యలు చేసిన బండి సంజయ్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని రాజేంద్రనగర్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షులు పోరెడ్డి ధర్మారెడ్డి అన్నారు. ఎమ్మెల్సీ, తెలంగాణ జాగృతి జాతీయ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితపై బండి సంజయ్ అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ స్థానిక ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ ఆదేశాల మేరకు రాజేంద్రనగర్ చౌరస్తాలో శనివారం డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో బండి సంజయ్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా పోరెడ్డి ధర్మారెడ్డి మాట్లాడుతూ మహిళలపై గౌరవం, మర్యాద లేని బండి సంజయ్ పార్టీ అధ్యక్షుడిగా అనర్హులన్నారు. బీజేపీ ఆయనను వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. రాబోయే ఎన్నికల్లో మహిళలే బీజేపీకి తగిన గుణపాఠం చెబుతారన్నారు. కార్యక్రమంలో పార్టీ ప్రధాన కార్యదర్శి పలుగుచెరువు మహేష్, జాగృతి నాయకులు రగడంపల్లి శ్రావణ్, కోఆప్షన్ సభ్యులు మలాకీ రత్నం, మహిళా విభాగం అధ్యక్షురాలు యాదమ్మ యాదవ్, సీనియర్ నాయకులు పడమటి శ్రీధర్‌రెడ్డి, జీవన్‌దాస్, అనుముల జాన్‌పాల్, ఉమారెడ్డి, సాయిమాలిక్, శ్రీవర్ధన్‌రెడ్డి, ఎడ్లకాడి సూర్యం, వీర్లపల్లి నవీన్, నందిగామ నర్సింహ, ప్రీతంరాజ్, అక్కిరాజు సుబ్బారావు, రియాజ్ ఆలీ, కాటి దేవేందర్, మంజుల, లేవి రాజ్, శివాగౌడ్, నరేందర్, ప్రభాకర్‌రెడ్డి, దాసరి రమేష్, పలుగుచెరువు మహేందర్, అరింట్ల విశాల్, ఆదిరాల అరుణ్‌బాబు, బట్టు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


రాజేంద్రనగర్ చౌరస్తాలో బండి సంజయ్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

ఘనంగా ప్రతిష్ఠాపన పూజలు

మణికొండ: మణికొండ మున్సిపాలిటీ కేంద్రం, క్వార్టర్స్‌లోని శ్రీ వీరాంజనేయస్వామి దేవాలయం ఆవరణలో గత మూడు రోజులుగా కొనసాగుతున్న ధ్వజ స్తంభ ప్రతిష్ఠాపన పూజలు శనివారం ఘనంగా ముగిశాయి. వేద పండితుల మంత్రోచ్చారణతో మూడు రోజులుగా క్వార్టర్స్ మారు మోగుతుంది. చివరి రోజు పూజల్లో భాగంగా శనివారం ఉదయం మండప పూజ, హవణం, గర్త సంస్కారం నిర్వహించారు. అనంతరం యంత్ర ప్రతిష్ఠాపన, ధ్వజ ప్రతిష్ఠ నిర్వహించారు. అనంతరం పూర్ణాహుతి, హారతి, మంత్రపుష్పం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ధ్వజ స్తంభ దాతలు భాస్కర్‌రెడ్డి, నాగిరెడ్డి దంపతులు, మున్సిపల్ చైర్మన్ కె.నరేందర్, బీఆర్ఎస్ ఫ్లోర్‌లీడర్ కె.రామకృష్ణారెడ్డి, బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు బి.శ్రీరాములు, కౌన్సిలర్ పి.శైలజ, బీజేపీ, బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల నాయకులు, కాలనీవాసులు, భక్తులు పాల్గొన్నారు.


ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన పూజల్లో పాల్గొన్న దాత భాస్కర్‌రెడ్డి దంపతులు


ఆంజనేయస్వామిని దర్శించుకున్న మున్సిపల్ చైర్మన్ నరేందర్

ఆడిపాడిన విద్యార్థులు

గోల్కొండ: విద్యార్థులను చదువులతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు పై కూడా శ్రద్ధ కనబర్చాలని విజన్ స్కూల్ కరెస్పాండెంట్ డాక్టర్ వీఎంఎస్ రాణి అన్నారు. విజన్ స్కూల్ వార్షికోత్సవ వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. ఈ వేడుకలకు మహ్మద్ ఖలీక్ ఉర్ రహమాన్ ప్రత్యేక అతిధిగా హాజరయ్యారు. విద్యార్థులను ఉత్తమ భావి పౌరులుగా తీర్చిదిద్దవలసింది ఉపాధ్యాయులేనని అన్నారు.

ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత

రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి

మణికొండ: ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలని, రోజూ దేవాలయానికి వెళితే మనసు ఎంతో ప్రశాంతంగా ఉంటుందని రాష్ట్ర దేవాదాయ, న్యాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. మణికొండ మున్సిపాలిటీ, మైహోం అవతార్ టవర్స్ సమీపంలోని శ్రీ సంకట హర హనుమాన్ దేవాలయ ఆవరణలో శనివారం నిర్వహించిన నవగ్రహ విగ్రహ ప్రతిష్ఠాపన పూజల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం మీడియాతో మాట్లాడుతూ మన పరిసరాల్లో ఉన్న అన్ని దేవాలయాల్లో నిత్యం పూజలు జరిగేలా చూడాల్సిన బాధ్యత స్థానికులపై ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రముఖ దేవాలయాల అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుందన్నారు. పురాతన శ్రీ సంకట హర హనుమాన్ దేవాలయాన్ని జీర్ణోద్ధరణ చేయడం అభినందనీయమన్నారు. దేవాలయం భూమిని రెవెన్యూ రికార్డుల్లో నమోదు చేయించి నిర్వహణకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తామని హామీ ఇచ్చారు.



ముగిసిన పూజలు...

పుప్పాలగూడ రెవెన్యూ పరిధిలోని శ్రీ సంకట హర హనుమాన్ దేవాలయం ఆవరణలో గత మూడు రోజులుగా కొనసాగిన నవగ్రహ విగ్రహ ప్రతిష్ఠాపన పూజలు శనివారం ఘనంగా ముగిశాయి. చివరి రోజు పూజల్లో భాగంగా ఉదయం పంచామృత స్నపనం, మూల మంత్ర హావనములు, ఘర్తన్యాసం నిర్వహించారు. 9.18 గంటలకు విగ్రహ ప్రతిష్ఠాపన పూర్తి చేశారు. అనంతరం కుంభబలి, కన్యాగోవు, దర్పణ దర్శనం, అర్చన పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం దేవాలయ ఆవరణలో భక్తులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమాల్లో రాష్ట్ర జల వనరుల అభివృద్ధి సంస్థ చైర్మన్ వి. ప్రకాష్‌రావు, ఆలయ కమిటీ చైర్మన్ టి. అంజన్ కుమార్‌గౌడ్, ఉపాధ్యక్షుడు పి.శ్రీనివాస్, ఆలయ నిర్వాహకుడు కస్తూరి కృష్ణస్వామిలతో పాటు బీజేపీ, బీఆర్ఎస్ పార్టీల నాయకులు, భక్తులు పాల్గొన్నారు.


ప్రతిష్ఠాపన పూజల్లో పాల్గొన్న మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, తదితరులు